సాక్షి
జగిత్యాల
గురువారం, 31, ఆగస్టు, 2023



బీర్‌పూర్ మండలం తుంగూర్ ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు





నాకు నువ్వు రక్షా.. నీకు రాఖీ రక్షా.. అంటూ సోదర, సోదరీమణుల ఆప్యాయతకు ప్రతీక అయిన రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమయ్యారు. తమ సోదరులకు రాఖీ కట్టేందుకు తోబుట్టువులు రెడీ అయ్యారు. వివిధ రకాల డిజైన్లతో రాఖీలు మార్కెట్లో ఆకట్టుకుంటుండగా కొనుగోళ్లతో సందడిగా మారాయి. రక్షాబంధన్ సందర్భంగా మిఠాయి దుకాణాల్లో గిరాకీ నెలకొంది. పలురకాల స్వీట్లు నోరూరిస్తుండగా.. కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. జిల్లాలోని కొన్నిచోట్ల ముందస్తు రాఖీ వేడుకలూ జరుపుకున్నారు.

నేడు రక్షాబంధన్ సందర్భంగా ప్రత్యేక కథనం.. - 8లో▸

వర్షకొండ హైస్కూల్‌లో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

న్యూస్‌రీల్

ఇస్రో చైర్మన్‌కు పెద్ద రాఖీ



రాఖీతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోరుట్లరూరల్: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు పెద్దరాఖీని పోస్టు ద్వారా పంపించారు. పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నిత్యజీవితంలో సెన్సార్ల ఉపయోగంపై తొలుత సెమినార్ నిర్వహించారు. ఇస్రో సైంటిస్టులు త్వరలో చేపట్టే ఆదిత్య తదితర ప్రయోగాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ రాఖీ తయారు చేశారు. విద్యార్థులు మనుజ్యోతి, కీర్తన, నందిని, ఇందూప్రియ, సాత్విక, ఉషశ్రీ, రమని, ప్రధానోపాధ్యాయుడు గడీల భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



రాఖీ కడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. బుధవారం హస్నాబాద్ శ్రీ భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ మల్లారెడ్డి పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. నాయకులు జున్ను రాజేందర్, సతీశ్, గంగన్న, శేఖర్, విజయ్‌చందర్ పాల్గొన్నారు.

రాఖీ కట్టిన దావ వసంత

కథలాపూర్(వేములవాడ): జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో కథలాపూర్ జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావుకు దావ వసంత రాఖీ కట్టారు.

పేషెంట్లకు నాణ్యమైన వైద్యం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

మల్యాల(చొప్పదండి): పేషెంట్లకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. నూకపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. వచ్చేనెలలో జాతీయ అసెస్‌మెంట్ టీం జిల్లాలో సర్వే చేస్తుందని, ఈసందర్భంగా సుమారు 500 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇందులో 70శాతం మార్కులు సాధిస్తే ఆరోగ్య ఉప కేంద్రం అభివృద్ధికి ఏటా రూ.1.26లక్షల చొప్పున మూడేళ్లపాటు నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. డాక్టర్ మౌనిక, సీనియర్ అసిస్టెంట్ సాధిక్, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్‌ఎం శకుంతల, ఆశ కార్యకర్తలు రమాదేవి, శ్యామల, రజిత, నవ్య పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ పూర్తిచేయండి



మాట్లాడుతున్న డీఆర్డీవో నరేశ్

జగిత్యాలజోన్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టే సెర్ప్ కార్యక్రమాల అమలును వేగవంతం చేయాలని డీఆర్డీవో నరేశ్ సూచించారు. జిల్లా కేంద్రంలో ఏపీఎంలతో బుధవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల బ్యాంకు లింకేజీలు లక్ష్యం ప్రకారం పూర్తిచేయాలని సూచించారు. అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సుధీర్, డీపీఎంలు మాణిక్‌రెడ్డి, వెంకటేశం, మల్లేశం, వనజ పాల్గొన్నారు.

గురుకులం ఎదుట ధర్నా

మెట్‌పల్లి(కోరుట్ల): మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినుల తల్లిదండ్రులు బుధవారం గురుకులం ఎదుట ధర్నా చేశారు. రాఖీ పండుగ కోసం తమ పిల్లలను ఇళ్లకు పంపించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాల ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాలికలను ఇళ్లకు పంపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

ప్రాణం తీస్తున్న నిర్లక్ష్యం!

- జిల్లాలో రోజుకో విద్యుత్ ప్రమాదం
- అసువులు బాస్తున్న రైతులు, యువకులు
- మూగజీవాలనూ వదలని విద్యుత్ తీగలు

- ఈ ఏడాది ఆగస్టు 29న పెగడపల్లి మండలం మ్యాక వెంకయ్యపల్లికి చెందిన రైతు నల్ల రాజిరెడ్డి తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- ఇటీవల మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన బోడ్డు పెద్ద గంగారెడ్డి విద్యుత్ మోటర్ సర్వీస్ వైరు తాకి కరెంట్ షాక్‌తో మృతి చెందాడు.



పెగడపల్లిలో విచారణ జరుపుతున్న అధికారులు(ఫైల్)

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వారం రోజులకో విద్యుత్ ప్రమాదం జరుగుతోంది. కొన్నిచోట్ల మనుషులు చనిపోతే.. మరికొన్నిచోట్ల పశువులు మృత్యువాత పడుతున్నాయి. ప్రమాదాలు నియంత్రించేందుకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో పెద్దగా సత్ఫలితాలు రావడంలేదు.

ఏటా వంద వరకు ప్రమాదాలు..

- శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు అక్షరాస్యత శాతం పెరిగినా విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన రావడంలేదు.
- సరఫరాలో అవాంతరాలు తొలగిస్తున్నా, అవసరమైన చోట వెనువెంటనే మరమ్మతు చేస్తున్నా ప్రమాదాలు ఆగడం లేదు.
- తద్వారా ట్రాన్స్‌కో అధికారులే కాదు.. బాధిత కుటుంబాలూ ఆందోళన చెందుతున్నాయి.
- గత ఏప్రిల్ 21 నుంచి మార్చి 22వ తేదీ వరకు 120 విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.
- ఇందులో 29 మంది జనాలు చనిపోయారు. 9 మంది గాయాలతో విగతజీవులయ్యారు. 82 పశువులు మృత్యువాత పడ్డాయి.
- ఏప్రిల్ 22 నుంచి మార్చి 23వ తేదీ వరకు 102 వరకు విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అందులో 32 మంది ప్రజలు చనిపోయారు. 11 మంది గాయాలతో బయటపడ్డారు. 59 పశువులు చనిపోయాయి.
- ఏప్రిల్ 23 నుంచి ఈనెల 23వ తేదీ వరకు 42 విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అందులో 10 మంది చనిపోగా, 32 పశువులు మృత్యువాతపడ్డాయి.

నిర్లక్ష్యమే ప్రధాన కారణం..

విద్యుత్ సరఫరాపై కస్టమర్లకు అవగాహన ఉండటం లేదని అధికారులు చెబుతున్నారు. స్తంభం నుంచి వచ్చే సర్వీస్ వైరులో రెండు, మూడు తీగలు ఉంటే, ఎందులోంచి కరెంట్ సరఫరా అవుతుందో తెలియదు. ఇంట్లో, వ్యవసాయ పంపుసెట్ వద్ద తీగ ఊడిపోతే టెస్టర్‌తో టెస్ట్ చేయకుండానే కొందరు మరమ్మతు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. శిథిలమైన ఇళ్లు, వ్యవసాయ బావుల వద్ద ఎర్తింగ్ ఏర్పాటు చేయడం లేదు. ఎర్తింగ్ ఉంటే కరెంట్ నేలలోకి వెళ్లి షాక్ కొట్టే అవకాశం ఉండదని అధికారులు అంటున్నారు. రైతులు నాసిరకం మోటార్లు, పైపులు, సర్వీస్ వైర్లు వినియోగించడంతోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్ తీగల వద్ద బట్టలు ఆరవేస్తూ మరికొందరు షాక్‌కు గురవుతున్నారు. విద్యుత్ మోటార్లు నడిచేటప్పుడు గడ్డి కోస్తూ, ఎలుకలు కొరికిన వైర్లతో షాక్ తగిలి ఇంకొందరు చనిపోతున్నారు.

విస్తృతంగా అవగాహన..

- ట్రాన్స్‌కో పరిధిలో 34 సెక్షన్లు ఉన్నాయి.
- ప్రతీ సెక్షన్‌కు ఒక ఏఈ, లైన్‌మెన్, హెల్పర్లు ఉన్నారు.
- వీరు గ్రామాల్లో తరచూ తలెత్తే సమస్యలు సరిచేస్తున్నారు. కానీ, విద్యుత్‌పై పల్లెవాసులకు అవగాహన కల్పించలేకపోతున్నారు.
- కేవలం అధికారులు చేపట్టే సదస్సులు, సమావేశాలతోనే ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.
- మరమ్మతుల సమయంలో రబ్బర్ చెప్పులు, చేతుకు గ్లౌస్‌లు వినిగించాల్సి ఉంది.
- కొందరు రైతులు వ్యవసాయ మోటార్లకు ఏళ్లుగా రిపేరు చేయించడం లేదు.
- ట్రాన్స్‌పార్మర్ లేదా, విద్యుత్ తీగల్లో లోపాలు ఉంటే.. అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.
- చేపలు పట్టేందుకూ విద్యుత్ తీగలు ఉపయోగించి, పంటకు రక్షణగా కరెంట్ వైర్లు పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు.
- ఇలా చేస్తే కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



విద్యుత్ ప్రమాదాల నియంత్రణ కోసం ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం కరపత్రాలు పంచుతున్నాం. మైకులు, చాటింపుల ద్వారా అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. ప్రధానంగా వ్యవసాయ మోటార్ల వద్ద తీసుకునే జాగ్రత్తలపై వివరిస్తున్నాం. వినియోగదారుల నిర్లక్ష్యంతోనే చాలా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు క్షేత్రస్థాయి సర్వేలో తేలింది.

– సత్యనారాయణ,ట్రాన్స్‌కో జిల్లా అధికారి

వీడని మిస్టరీ

- అక్క మృతితో నాకు సంబంధం లేదు
- ఫ్రెండ్‌కు చెప్పి మద్యం నేనే తెప్పించా
- ఎవరో బాయ్‌ఫ్రెండ్‌కు అక్క ఫోన్ చేసింది
- తమ్మునికి చందన వాయిస్ మెసేజ్
- డబ్బులు.. బంగారం మాయం
- దీప్తి ఒంటిపై గాయాలు..?
- పోలీసు బృందాల గాలింపు

'సాయి... నేను, దీప్తి అక్క మద్యం తాగాలని అనుకున్నం.. కానీ నేను తాగలేదు.. అక్కనే తాగింది.. నేను నా ఫ్రెండ్‌తో తెప్పించా.. అది ఒప్పుకుంటా.. ఇంకా అక్కవాళ్ల బాయ్‌ఫ్రెండ్‌ను పిలుస్తా అంటే నేను వద్దన్నా.. అయినా పిలుస్తా అంది.. సరే లే నీ ఇష్టం అన్నా.. నేను ఇంట్లో నుంచి వెళ్లిపోదామనుకున్నా.. నిజమే.. అది నేను ఒప్పుకుంటా.. అక్కకు చెప్పి వెళదామనుకున్నా.. కానీ.. అప్పటికే అక్క హాఫ్ బాటిల్ వోడ్కా కంప్లీట్ చేసింది.. అంతకుముందే ఫోన్‌లో మాట్లాడింది.. తర్వాత సోఫాలోకి వెళ్లి పడుకుంది.. నేను లేపితే లేవలేదు.. పడుకుంది కదా.. అని డిస్టర్బ్ చేయలేదు.. చాన్స్ దొరికింది కదా అని.. నేనే ఇంట్లో నుంచి వెళ్లిపోయా.. నా తప్పేం లేదు.. నాకు అక్కను చంపే ఉద్దేశమే లేదు.. ఇలా అవుతుందని అనుకోలేదు.. అక్కను నేనెందుకు చంపుతా.. నా దగ్గర డబ్బులు లేవు కాబట్టి ఇంట్లో నుంచి తీసుకెళ్లా'

– తన తమ్ముడు సాయి మొబైల్‌కి చందన పంపిన వాయిస్ మెసేజ్ ఇది..



కోరుట్ల బస్టాండ్ సీసీ ఫుటేజీలో యువకుడితో చందన

కోరుట్ల: చందన తాను అక్కను చంపలేదని తమ్ముడు సాయికి వాయిస్ మెసేజ్ పంపడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మెసేజ్ ఆధారంగా విచారణ ముమ్మరం చేశారు. కోరుట్ల బస్టాండ్‌లో మంగళవారం ఉదయం కనిపించిన సీసీ ఫుటేజీ చిత్రాలు.. చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్‌వి కావనే సమాచారంతో విచారణ గందరగోళంగా మారింది. అయితే, చందన బాయ్ ఫ్రెండ్ కారులో వచ్చి ఉంటాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చందన ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు మరోసారి పరిశీలిస్తున్నారు. ఆమె వాయిస్ మెసేజ్ వచ్చిన సెల్‌ఫోన్ ఆధారంగా రెండు బృందాలు హైదరాబాద్‌కు చేరుకుని గాలింపు చేపట్టాయి.

దీప్తి ఒంటిపై గాయాలు..!?

- అనుమానాస్పదంగా మృతి చెందిన దీప్తి ఒంటిపై స్వల్పగాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో తేలినట్లు సమాచారం.
- దీప్తి టీషర్ట్ కింద శరీరం కాస్త కమిలిన గాయాలు, చెంపపై గీసుకుపోయినట్లుగా ఓ చిన్నగాయం ఉన్నట్లు తెలిసింది.
- దీంతోపాటు దీప్తి చేతులు కట్టేసినట్లుగా మణికట్టు వద్ద గాయం ఉన్నట్లు సమాచారం.
- ఒకవేళ చేయి విరిగి ఉంటే బంక దీప్తి హత్యకు గురైందన్న అంశానికి మరింత బలం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతాయి.
- సాధారణంగా పోస్టుమార్టం నివేదికకు సంబంధించిన షార్ట్ రిపోర్టు అదే రోజు అందించే ఆనవాయితీ ఉన్నా.. వైద్యులు ఈ విషయంలో కుదరదని చెప్పినట్లు తెలిసింది.

డబ్బులు, నగలు మాయం

బంక శ్రీనివాస్‌రెడ్డి(దీప్తి తండ్రి) ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, సుమారు 50 తులాల వరకు బంగారు ఆభరణాలు మాయమైనట్లు సమాచారం. ఇంట్లోనుంచి వెళ్లిపోయిన చందన.. డబ్బులు తాను తీసుకున్నట్లు వాయిస్ మెసేజ్‌లో చెప్పినా.. బంగారం విషయం ఎత్తలేదు. బంగారం సైతం చందన తీసుకెళ్లి ఉంటుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చందన తన క్లాస్‌మేట్ ఒకరితో కొన్నాళ్లుగా సన్నిహితంగా ఉంటోందని, అతడితో కలిసి డబ్బులు, నగలు తీసుకు వెళ్లి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

దారి మళ్లిస్తున్నారా?

చందన తమ్మునికి పంపిన వాయిస్ మెసేజ్‌లో దీప్తి తన బాయ్‌ఫ్రెండ్‌కు ఫోన్ చేసి ఇంటికి రమ్మంటానని చెప్పిందని, తాను వద్దన్నానని చెప్పిన తీరు సంఘటనను దారి మళ్లించేందుకేనా? అనే అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. వాయిస్ మెసేజ్‌తో ఇంట్లో నుంచి చందన వెళ్లిపోయిన తర్వాత వేరెవరో వచ్చి ఉంటారన్న రీతిలో అనుమానాలు వచ్చేలా ఉండటం గమనార్హం. చందన, ఆమె బాయ్ ఫ్రెండ్ కలిసి దీప్తి చనిపోవడానికి తమకు సంబంధం లేదని నమ్మించడానికి ఈ రకంగా మేసెజ్ పెట్టారా? అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ దిశలో పోలీసు దీప్తి సెల్‌ఫోన్ డాటాను పరిశీలిస్తున్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల: యువ ఓటరు నమోదు కోసం సిస్టమెటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో స్వీప్‌పై ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, యువ ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా 24 డిగ్రీ కాలేజీలు, 72 ఇంటర్మీడియట్ కళాశాలల్లో స్వీప్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాస రచన పోటీలు, బాలికలకు మెహందీ పోటీలు, రంగోలి, డిబేట్ నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దివాకర, బీఎస్ లత, స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణపాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి

జగిత్యాలటౌన్: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి డిమాండ్ చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమగ్ర శిక్షా జాయింట్ అభియాన్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని భోగ శ్రావణి బుధవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. భారత సర్వోన్నత న్యాయస్థానం తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని శ్రావణి డిమాండ్ చేశారు. ఈ



మాట్లాడుతున్న భోగ శ్రావణి

కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

జగిత్యాల: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతోపాటు, కనీస వేతనం అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రవి కోరారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు.

చేపల పెంపకంతో ఉపాధి

- మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: రాష్ట్రప్రభుత్వం పంపిణీ చేస్తున్న చేపలపిల్లల పెంకంతో మత్స్యకారులు ఆర్థికంగా ఎదగవచ్చని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద తొలివిడతలో 80 వేల పిల్లలను గోదావరి నదిలో బుధవారం వదిలారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. చేపపిల్లల పెంపకం కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోందన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించడానికి సీఎం కేసీఆర్ ఈకార్యక్రమాన్ని చేపట్టారని



చేపపిల్లలు వదులుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

తెలిపారు. ఇందుకోసం చెరువులు, కుంటలు మరమ్మతు చేయించారని అన్నారు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌లో ప్రతీ సంవత్సరం 6లక్షల చేపపిల్లలు వదులుతున్నామని మంత్రి చెప్పారు. అంతకుముందు నేరెళ్ల, గోవిందుపల్లె గ్రామాల్లో చేపట్టిన మున్నూర్‌కాపు కుల సంఘ భవనం, బుద్దేశ్‌పల్లెలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో వెల్గటూర్ మండలంలోని ముత్తునూర్‌కు చెందిన సుమారు 100 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, జిల్లా మత్స్యశాఖ అధికారులు, సర్పంచులు పలిగిరి వసుందర, రాజన్న పాల్గొన్నారు.

నాలుగేళ్లు ఎందుకు నాన్చారు?

- వందరోజుల్లో ఎందుకు చేయలేదు?
- ఎన్నికల్లో లబ్ధికోసమే 'టీడీఆర్'
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: వందరోజుల్లో యావర్‌రోడ్డు విస్తరిస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్లు ఎందుకు నాన్చారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రజలు తిరగబడతారనే టీడీఆర్‌ను తెరపైకి తెచ్చారని జీవన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో యావర్‌రోడ్డును 40 అడుగుల నుంచి 60 అడుగులకు విస్తరించామని, రద్దీని తగ్గించేందుకు బైపాస్ రోడ్డు నిర్మించామని గుర్తుచేశారు. నర్సింగాపూర్ బైపాస్ రోడ్డుతో పల్లె



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

లు వెలుగులోకి వచ్చాయన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపిస్తే వందరోజుల్లోనే యావర్‌రోడ్డు వంద అడుగులకు విస్తరిస్తామని చెప్పిన మంత్రి కేటీఆర్.. ఇన్నాళ్లు ఏం చేశారని నిలదీశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందనే భయంతోనే టీడీఆర్‌ను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. తాము టీడీఆర్‌కు వ్యతిరేకం కాదని, కానీ, ఇన్నాళ్లూ ఎందుకు తేలేదని ప్రశ్నించారు. ఊ అంటే వందల కోట్లు అని మాట్లాడే సీఎం కేసీఆర్.. యావర్‌రోడ్డు విస్తరణ కోసం రూ.50కోట్లు కేటాయించలేరా? అని ప్రశ్నించారు. తన హామీపై కేటీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే యావర్‌రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణానికే పరిమితం కావాల్సిన మాస్టర్‌ప్లాన్‌ను పరిసర గ్రామాలు ప్రభావితం అయ్యేలా రూపొందించిన సర్కార్.. రైతుల పోరాటంతో జీవో ఉపసంహరించుకున్నప్పటికీ అది తాత్కాలిక ఉపశమనంగానే ఉండనుందని పేర్కొన్నారు. నాయకులు కొత్త మోహన్, బండ శంకర్, విజయలక్ష్మి, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, జున్ను రాజేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విరంచి స్వప్నికకు రూ.లక్ష పారితోషికం



స్వప్నికను సన్మానిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి: ఇటీవల షార్జాలో జరిగిన ఆసియా యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన పట్టణానికి చెందిన విరంచి స్వప్నికకు మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం రూ.లక్ష పారితోషికం అందించారు. రంగు విరించి స్వప్నిక కొన్ని సంవత్సరాల నుంచి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చూపుతూ వస్తోంది. ఇటీవల షార్జాలో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమెను శాలువాతో సన్మానించి రూ.లక్ష అందజేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన గోపాల్‌రెడ్డి



కిషన్‌రెడ్డితో గోపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): సిరికొండ గ్రామానికి చెందిన బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిశారు. జిల్లాలో పార్టీ పరిస్థితులు, రాజకీయాల గురించి చర్చించినట్లు ఆయన తెలిపారు. అనంతరం సన్మానించామన్నారు.

‘200 శాతం పెంచి.. రూ.200 తగ్గిస్తారా?’

జగిత్యాలజోన్: నరేంద్రమోదీ అధికారంలోకి రాకముందు రూ.410 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధరను ఆ తర్వాత 200 శాతం పెంచారని, ఇప్పుడు రూ.200 తగ్గిస్తే ఏం ప్రయోజనమని జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ప్రశ్నించారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. ఎన్నికల కోసమే రూ.200 తగ్గిస్తూ, మహిళలకు తీపు కబురంటూ ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్

- తోబుట్టువుల అనురాగాలకు సూచిక
- నేడు రాఖీ పౌర్ణమి



రాఖీ వేడుకలు జరుపుకుంటున్న కరీంనగర్‌లోని రాజస్థానీ కుటుంబ అన్న, చెల్లెలు

విద్యానగర్/కరీంనగర్ కల్చరల్: ఆధునికయుగంలో అనుబంధాలు ఇంకా తరిగిపోలేదు. ఉమ్మడి కుటుంబాలు తగ్గినా పేగుబంధాలు ధృడంగానే ఉన్నాయి. ఎక్కడ ఉన్నా పరస్పర యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆత్మీయత పంచుతూ తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేది రక్షాబంధన్. సోదరీసోదరుల ఆత్మీయ బంధానికి ప్రతీక అయిన రక్షా బంధన్‌ను గురువారం దేశవ్యాప్తంగా జరుపుకోనున్నారు. పండుగ రోజున పుట్టిళ్లు సందడిగా మారుతాయి. అక్కాచెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల ముంజేతులన్నీ వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళకళలాడుతాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన కట్నకానుకలు సోదరీమణులకు ఇస్తారు. రక్షాబంధన్‌ను రాఖీపౌర్ణమి, జంద్యాల పౌర్ణమిగా పిలుస్తారు.

పండుగ ఎలా ప్రారంభమైందంటే..

పూర్వం దేవతలకు, రాక్షసులకు మధ్య పుష్కర కాలం జరిగిన యుద్ధంలో ఓడిపోయిన దేవతల రాజు దేవేంద్రుడు పరివారమంతటినీ కూడగట్టుకొని అమరావతిలో తలదాచుకుంటాడు. భర్త నిస్సహాయతను చూసిన ఇంద్రాణి తరుణోపాయం ఆలోచిస్తుంది. రాక్షస రాజు అమరావతిని దిగ్బంధం చేస్తున్నాడని తెలుసుకొని భర్త దేవేంద్రుడు సమరం చేయడానికి ఉత్సాహాన్ని కల్గిస్తుంది. సరిగా ఆ రోజు శ్రావణ పౌర్ణమి కావడంతో పార్వతిపరమేశ్వరులు, లక్ష్మీనారాయణను పూజించి రక్షను దేవేంద్రుని చేతికి కడుతుంది. దేవతలందురూ పూజించిన రక్షాలను ఇంద్రుడికి కట్టి పంపుతారు. సమరంలో గెలిచిన ఇంద్రుడు తిరిగి త్రిలోక ఆధిపత్యాన్ని పొందుతాడు. అలా రాఖీ పండుగా మొదలైందని పురాణాలు చెబుతున్నాయి. అన్నాతమ్ముళ్లకు కట్టే రక్షాబంధన్ ద్వారా వారు తలపెట్టే కార్యాలు విజయవంతం కావాలని, సుఖసంతోషాలు, సిరి సంపదలు కలగాలని ఆకాంక్షించే విశిష్టత రాఖీ పండుగకు ఉంది. నూతన వస్త్రాలు, బహుమతులతో ఆనందంగా గడుపుతారు. "బ్రిటీష్‌వారు దేశాన్ని పాలిస్తున్న కాలంలో వారి ఆగడాలకు అడ్డులేకుండా పోయింది. స్త్రీలు రక్షణ కోసం వీరయోధులకు రక్షాబంధన్ కట్టేవారు. సోదరభావంతో యోధులు మహిళలకు రక్షణ కల్పించేవారు. రాణి కర్ణావతి దుర్గాన్ని శత్రువులు ముట్టడించినప్పుడు ఢిల్లీ బాదుషాకు రాఖీ పంపంది. బాదుషా ఆమెను సోదరిగా భావించి శత్రువులను తరిమికొట్టి ఆమె ఇంట్లో భోజనం చేసి కానుకల సమర్పించినట్టు చరిత్ర.

ఆన్‌లైన్ రక్షాబంధన్

కాలం మారడంతో పాటు రక్షబంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరత్రా కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదురులకు పోస్టు ద్వారా రాఖీలను పంపితే కట్టకొని తోబుట్టువులకు కానుకలు పంపుతుండే సంప్రదాయం నేటికి కొనసాగుతోంది. సాంకేతిక పరిజ్ఞానం విస్తృతం కావడంతో ఆన్‌లైన్ ద్వారా రాఖీలను పంపి ఆన్‌లైన్ ద్వారానే కానుకులు స్వీకరిస్తున్నారు. సామాజికి మాధ్యమాల ద్వారా పరస్పరం అభినందనలు తెలుపుకునే వెసులుబాటు ఉంది. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కుచెదరలేదు.

తమ్ముడంటే ప్రాణం



మా ఇంట్లో మేము ముగ్గురం, మాకు తమ్ముడు అన్వేశ్ అంటే ప్రాణం, ప్రస్తుతం వాడు హుస్నాబాద్‌లోని శ్రీనివాస హాస్పిటల్ ఇన్‌చార్జి. రాఖీపండుగ రోజు ఎంత బిజీగా ఉన్నా వాడి దగ్గరికి వెళ్లి మేమిందరం కలిసి రాఖీ కడతాం. తమ్ముడు కూడా మా కోసం ప్రతీ పండుగకు ఎదురుచూస్తుంటాడు, వాడి ప్రేమాభిమానాలు ఎప్పటికీ కావాలి. వాడు ఆనందంగా ఉండాలని, ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటాం.

– స్రవంతి, అమూల్య, కరీంనగర్

ముగ్గురు అన్నదమ్ములు



నాకు ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు అన్నలు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. తమ్ముడు మాత్రం కరీంనగర్‌లో మాతోనే ఉంటాడు, రైస్‌మిల్లు ఉంది. ప్రతి పండుగకు ఇద్దరు అన్నలు కళ్లముందు లేకున్న రాఖీ పంపిస్తాను. ఇక్కడ ఉండే కృష్ణకు మాత్రం స్వయంగా రాఖీ కడతాను.

– సింగిరికొండ మాధవి, తిరుమలనగర్, కరీంనగర్

ఈ సమయాలు అనుకూలం



గురువారమే రాఖీ పౌర్ణమి జరుపుకోవాలి. శుభకార్యాలు, పండుగలకు సూర్యోదయ తిథి ప్రమాణంగా పాటించాలి. ఉదయం 6.30 నుంచి 9.45, మళ్లీ 10.50 నుంచి 11.50 నిమిషాల మధ్య, మధ్యాహ్నం 12.30 నుంచి 2.45 వరకు, సాయంత్రం 3.45 నుంచి 6.00 గంటల మధ్య రాఖీలు కడితే శుభకరం.

– శ్రీతాటిచెర్ల హరికిషన్‌శర్మ, పురోహితుడు

పాతకక్షలతోనే సతీశ్ హత్య

- ఏడుగురు నిందితుల అరెస్ట్
- 7 మొబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు బైక్‌లు స్వాధీనం
- డీఎస్పీ రవీందర్‌రెడ్డి వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: సంచలనం సృష్టించిన కస్నం సతీశ్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఇందిరానగర్‌కు చెందిన కస్నం సతీశ్ ఈనెల 20న రాత్రి 10.58 గంటల సమయంలో తన స్నేహితుడు నిఖిల్‌తో కలిసి పట్టణ శివారులోని శక్తి బార్ వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న శివాజీనగర్‌కు చెందిన జక్కం రాజేశ్.. సతీశ్‌తో మాటలు కలిపాడు. బార్ సమీపంలోని సందిలోకి తీసుకెళ్లాడు. కొద్దిదూరం వెళ్లాక సతీశ్ తలపై రాజేశ్‌తోపాటు పాతర్ల నవీన్ కర్రలతో దాడి చేశారు. అక్కడే ఉన్న నేరవేణి రమేశ్ ఇటుకతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన సతీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. 2015లో రాజేశ్, సతీశ్ మధ్య ఓ విషయంలో వివాదం తలెత్తింది. ఈక్రమంలో సతీశ్.. రాజేశ్‌పై దాడిచేశాడు. కొద్దిరోజుల తర్వాత ఇద్దరి మధ్య రాజీకుదిరింది. ఆ తర్వాత వీరి మధ్య పలుమార్లు ఘర్షణలు జరిగాయి. వీటిని దృష్టిలో ఉంచుకొనే సతీశ్‌ను హతమార్చారు. దాడిలో పాల్గొన్న ముగ్గురు పారిపోయేందుకు, డబ్బులు సమకూర్చే తదితర విషయాల్లో మెట్‌పల్లికి చెందిన తాటికొండ రామకృష్ణ, గుండు గోపాల్, మిట్టపల్లి రాంమోహన్, కోరుట్లకు చెందిన చింతకింది హరీశ్ సహకరించారు. హత్యలో ముగ్గురు పాలుపంచుకోగా, వారికి సహకరించిన నలుగురిని మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరిపై 302, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఒక కారు, రెండు ద్విచక్రవాహనాలు, ఏడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురి రికార్డు పరిశీలించాక నేరచరిత్ర ఉంటే పీడీ యాక్ట్ నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తామని డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఎస్‌ఐలు ఉమాసాగర్, నవీన్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేసింది కాంగ్రెస్సే..

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): తెలంగాణ ఇస్తే ఆంధ్రాలో నష్టం జరుగుతుందని తెలిసి కూడా మాటకు కట్టుబడి రాష్ట్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు కర్నాటకలో ఓ సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, అబద్ధపు మాటలు, అవాస్తవాలు ప్రచారం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దివంగత వైఎస్సార్ పాదయాత్ర చేసి చెప్పిన ప్రతీ హామీని 2014 వరకు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల్లో ఎన్నింటిని అమలు చేసిందో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మపురి అభివృద్ధికి రూ.500 కోట్లు ఇస్తామని, ఇరిగేషన్ విషయంలో 2 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఆ హామీలన్నీ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. ధర్మపురి నియోజకవర్గంలో మిగులు భూములు పేద వారికి పంపిణీ చేయకపోగా, ఆ భూములు కబ్జాకు గురవుతుంటే స్థానికంగా ఉన్న మంత్రి కొప్పుల ఈశ్వర్ కనీసం స్పందించడం లేదని దుయ్యబట్టారు. త్వరలోనే ధర్మపురిలో రేవంత్‌రెడ్డి పర్యటన ఉండబోతోందని, ఆ పర్యటనలో ధర్మపురి నియోజకవర్గానికి ఏం చేస్తామో ప్రకటిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, గాజుల విజయ్, లక్ష్మణ్, రమేశ్, సంజీవ్, శ్రీనివాస్, వెంకటస్వామి పాల్గొన్నారు.

హంతకుల కోసం గాలింపు

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని నాగారం వాడకు చెందిన కోల జలను పట్టపగలే దారుణంగా చంపిన కేసులో హంతకులను పట్టుకునేందుకు సీఐ ఆరీఫ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఆరుగురు ఎస్సైలతో ముమ్మరంగా గాలిస్తున్నారు. జల మంగళవారం ఉదయం నుంచి ఎక్కడకు వెళ్లిందనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఆమె వెళ్లిన ప్రతీచోట వార్డుల్లోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

నిరాశలో నిరుద్యోగులు

- డీఎస్సీలో ఉన్నవి 148 పోస్టులే..
- వీటికే మంజూరు ఇచ్చిన ప్రభుత్వం
- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల్లో తీవ్ర అసంతృప్తి

కథలాపూర్(వేములవాడ):జిల్లాలో డీఎడ్, బీఎడ్ కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగులకు నిరాశే ఎదురైంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఏళ్లుగా నిరీక్షిస్తుండగా.. ప్రభుత్వం ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ, డీఎస్సీ పోస్టుల సంఖ్య తక్కువగా ఉండటం, కేవలం 148 టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై సర్వత్రా ఆందోళనకు గురవుతున్నారు.

701 ఖాళీలు.. డీఎస్సీలో 148 పోస్టులు..

- జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాలుండగా.. 380 గ్రామాలున్నాయి.
- ఇందులో 511 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 85 ప్రాథమికోన్నత పాఠశాలలు, 187 జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి.
- వీటిలో 3,280 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు.
- పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంటే ఇప్పటికే సర్దుబాటు చేశారు.
- అయితే, ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల ఖాళీలు సుమారు 701 ఉన్నట్లు గతంలో నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు.
- ఖాళీ పోస్టుల్లో 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీచేసి మిగతా పోస్టులు నేరుగా భర్తీ చేస్తారు.
- ఇందుకోసం డీఎస్సీలో 148 పోస్టులకే ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

ఆరేళ్ల తర్వాత భర్తీ..

2017 సంవత్సరంలో ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీఆర్‌టీ నిర్వహించి నియామకాలు చేపట్టింది. ఆ తర్వాత నుంచి నియామకాల జాడే లేదు. ఎప్పటికైనా టీచర్ పోస్టులను భర్తీ చేస్తుందన్న నమ్మకంతో ఏటా డిగ్రీ పూర్తయినవారు బీఎడ్, డీఎడ్ కోర్సుల్లో చేరుతున్నారు. ఆ కోర్సులు పూర్తిచేశాక టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) అర్హత కోసం పరీక్ష రాస్తున్నారు. అయితే, ప్రస్తుతం జిల్లాలో 148 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కే నోటిఫికేషన్ జారీచేస్తామనడంతో బీఎడ్, డీఎడ్ పూర్తిచేసిన వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

అనుమతి ఇచ్చిన పోస్టులు ఇవే..

స్కూల్ అసిస్టెంట్	50
ఎస్జీటీ	53
లాంగ్వేజ్ పండిట్	37
పీఈటీ	08

ఎన్నికల కోసమేనా?



టీచర్ పోస్టుల భర్తీపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. ఆరేళ్ల తర్వాత చేపట్టే డీఎస్సీలో 148 పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వడం దారుణం. గతేడాది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో టెట్ రాసినవారు 32 వేల మంది ఉన్నారు. అలాంటిది వందల సంఖ్యలో పోస్టులు భర్తీ చేస్తామనడం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే.

– పాలెపు బలరాం, నిరుద్యోగి, ఎంఏ, బీఎడ్

మెగా డీఎస్సీ నిర్వహించాలి



ఆరేళ్ల తర్వాత టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నందున ప్రభుత్వం 22 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలి. అప్పుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. జిల్లాలో వేలాది మంది టెట్ అర్హత సాధించినవారుండగా.. వందల సంఖ్యలో టీచర్ పోస్టుల భర్తీ సరికాదు. ప్రభుత్వం ఇతర కారణాలు చూపకుండా షెడ్యూల్ ప్రకారం టీచర్ పోస్టులు భర్తీ చేయాలి.

– తులసి ఆగమయ్య, యూటీఎఫ్ నేత

పోస్టులను బహిర్గతం చేయాలి



జిల్లాలో ఎన్ని టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయో ప్రభుత్వం బహిర్గతం చేయాలి. వాటిని పూర్తిస్థాయిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వాలి. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే ఉపాధ్యాయుల కొరత తీర్చాలి. అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పులికాంత శశిధర్, డీటీఎఫ్ నేత

ఓటరుగా పేరు నమోదు చేసుకోండి

- ఆర్డీవో సోమ రాజేశ్వర్



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

కోరుట్ల: జిల్లాలో 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరుట్ల ఆర్డీవో సోమరాజేశ్వర్ సూచించారు. పట్టణంలోని శ్రీ అరుణోదయా డిగ్రీ కళాశాలలో బుధవారం ఓటరు మోదు, ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులకుఅవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవా లన్నారు. ఈవీఎంల పనితీరు, ఓటువేసే విధానాన్ని ఆయన వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజా యితీగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, కరస్పాండెంట్ పోతని ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ పోతని నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో దొంగలు పడ్డారు..





పెద్దమ్మ ఆలయం, ఘటనా స్థలంలో జాగిలంతో గాలింపు

ధర్మపురి: తిమ్మాపూర్, రాయపట్నం గ్రామాల్లోని ఆలయాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మూడు ఆలయాల తాళాలు పగులగొట్టి విగ్రహాలపై ఉన్న ఆభరణాలు, నగదు చోరీ చేశారు. తిమ్మాపూర్ శివారు పంచముఖ శ్రీఆంజనేయస్వామి, సమీపంలోని పెద్దమ్మ ఆలయాల్లో తొలుత సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. అమ్మవారి విగ్రహం మెడలోని పావుతులం బంగారం, హుండీలోని సుమారు రూ.పదివేలు అపహరించారు. రాయపట్నం గోదావరి నదీతీరంలోని శివాలయంలో అమ్మవారి మంగళసూత్రాలను దొంగిలించుకుపోయారు. సమాచారం అందుకున్న ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం ఆలయాలకు చేరుకున్నారు. జగిత్యాల నుంచి క్లూస్‌టీంను రప్పించారు. వేలిముద్రలను సేకరించారు. జాగిలాలతో ఆయా ప్రాంతాల్లో పరిశీలన చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.